క్లుప్తంగా

నేడు కడ్తాల్‌లో కేంద్ర బృందం పర్యటన

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం ప్రతినిధులు మంగళవారం కడ్తాల్‌లో పర్యటించనున్నారని గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్), సుపరిపాలన కేంద్రం, విశ్లేషణవిధానం(సీజీజీపీఏ), మానవ వనరుల నిర్వాహణ కేంద్రం(సీహెచ్ఆర్‌డీ) ఆధ్వర్యంలో జిల్లాలోని రాజేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల నిర్వహణ అంశంపై మూడురోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పరిశీలన నిర్వాహణ తీరు తెన్నులను పరిశీలించేందుకు కడ్తాల్ గ్రామంలో పర్యటించనున్నారని తెలిపారు.

రూ.6లక్షల నిధుల ప్రొసీడింగ్ అందజేత


ప్రొసీడింగ్ అందజేస్తున్న మహిపాల్

ఇబ్రహీంపట్నం: గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్ అన్నారు. చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.6లక్షలు మంజూరు చేసి ప్రొసీడింగ్స్‌ను ఎంపీటీసీ ఆంజనేయులుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్నిగ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పనులు చేపట్టనున్నామన్నారు. ఎంపీటీసీ ఆంజనేయులు.. జెడ్పీటీసీ మహిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వాయిదాలు చెల్లించండి

పీఏసీఎస్ సీఈఓ నాగరాజు

యాచారం: మార్చి 30 లోపు పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు అప్పు వాయిదాలను సకాలంలో చెల్లించాలని యాచారం పీఏసీఎస్ సీఈఓ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రూ.28 కోట్ల అప్పు వాయిదాలున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో అప్పులు చెల్లించి సంఘం ఆర్థిక ప్రగతికి సహకరించాలని కోరారు. మార్చి 30 లోపు అప్పు చెల్లించని రైతులకు నోటీసులు ఇచ్చి ఆస్తులు జప్తు చేస్తామని అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: బీజేపీ

తలకొండపల్లి: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని బీజేపీ నేత తల్లోజు ఆచారి అన్నారు. మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన బీజేపీ కార్యకర్త శ్రీశైలం ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటున్నాడు. శ్రీశైలం ఆరోగ్య విషయాలను ఆచారి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ చేత రూ.7200 ఆర్థిక సహాయాన్ని శ్రీశైలం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మల్లేశ్, దేవేందర్, మహేష్, రమేష్, ప్రశాంత్, పరమేష్, బాలస్వామి, దశరథం పాల్గొన్నారు.


ఆమనగల్లులో సంబురాలు

ఆర్ఆర్ఆర్ నాటునాటుకు ఆస్కార్‌పై హర్షం


స్వీట్లు తినిపించుకుంటున్న అభిమానులు

ఆమనగల్లు: తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఆర్ఆర్ఆర్ సినిమా ఒరిజినల్ సాంగ్ విభాగంలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో ఆమనగల్లు పట్టణంలో సోమవారం సంబురాలు నిర్వహించారు. స్థానిక ఎస్‌వీఎస్ థియేటర్ ఎదుట నందమూరి, మెగాస్టార్ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అభిమానులు బికుమాండ్ల నర్సింహ, కండె భాస్కర్, కుమార్‌గౌడ్, శ్రీదర్, సింహాద్రి, శివ, రామకృష్ణ, లడ్డు, నరేశ్, వెంకటేశ్, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ స్లిప్పుల పరిశీలన


ఓటర్ స్లిప్పులను పంచుతున్న అభ్యర్థుల మద్దతుదారులు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం 144 సెక్షన్ విధించారు. పోలింగ్ కేంద్రం సమీపంలోని జిరాక్స్ సెంటర్లను, మీసేవా కేంద్రాలు, స్టేషనరీలు, హోటళ్లను మూసివేయించారు. 21 మంది అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రంగంలో ఉండటంతో వారి మద్దతుదారులు పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో టెంట్‌లు వేసుకొని కూర్చున్నారు. ఉపాధ్యాయులకు పోలింగ్ చీటీలు అందిస్తూ సహాయం అందించారు.


ఇబ్రహీంపట్నం: ఓటు వేసిన ఉపాధ్యాయులు


ఆమనగల్లు: పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్స్‌ను తరలిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ఇబ్రహీంపట్నం/ కల్వకుర్తి: ఉమ్మడి మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌కు సంబంధించి ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 197 ఓట్లకుగాను 188 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.4 శాతంగా పోలింగ్ నమోదైంది. మంచాల పోలింగ్ స్టేషన్‌లో వందకు వంద శాతం పోలింగ్ నమోదైంది. యాచారం పోలింగ్ కేంద్రంలో 84 మంది ఓటర్లు ఉండగా 81 ఓట్లు పోలయ్యాయి. హయత్‌నగర్ జిల్లాపరిషత్ పాఠశాల పోలింగ్ స్టేషన్‌లోని 61, 61ఏ పోలింగ్ బూత్‌లలో మొత్తం 900 ఓట్లకు గాను 814 ఓట్లు పోలయ్యాయి. 90.4 శాతం పోలింగ్ జరిగింది. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు సంబంధించి ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ 99 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. మాడ్గుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 29 ఓట్లకు గాను 28 ఓట్లు పోలయ్యాయి.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలోని రెండు బూతుల్లో 736ఓట్లకు గాను 665 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఎల్‌బీనగర్ డీఎస్పీ పోలింగ్‌బూత్‌ను పరిశీలించారు. ఈనెల 16న కౌంటింగ్ నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు


యాచారం: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాచారం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నక్కర్తమేడిపల్లి గ్రామ సర్పంచ్ చిగురింత శ్రీనువాస్‌రెడ్డి సూచించారు. గ్రామంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఒకేరోజు 150 మందికి పైగా పరీక్షలు చేయించుకోగా అవసరమైనవారికి కళ్లాద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు శివలీల, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

కడ్తాల్: కంటి వెలుగు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. మండల కేంద్రంలో జనాభాను దృష్టిలో పెట్టుకుని కంటివెలుగు కేంద్ర నిర్వాహణ గడువును మరోనెల పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కిరణ్‌కుమార్, సంపూర్ణదేవి, షఫీ, రఘు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు బీచ్యానాయక్, ఏఎన్ఎంలు రమాదేవి, పుష్ప, ఆశ వర్కర్లు జ్యోతి, తిరుపతమ్మ, లావణ్య, సబితా తదితరులు ఉన్నారు.

133 మందికి పరీక్షలు..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. ఆకుతోటపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శిబిరంలో 133 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు పరీక్షిత్ నరేందర్, మంజులాదేవి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రజిత, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కడ్తాల్: రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో, కొండ్రిగానిబోడ్ తండాకు చెందిన పలువురు నాయకులు రాజు, హరిచంద్, రూప్‌సింగ్, రాజునాయక్ తదితరులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సర్పంచ్ సేవ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు మల్లేశ్‌గౌడ్, రామకృష్ణ, రమేశ్‌గౌడ్, రమేశ్, చంద్రశేఖర్‌గౌడ్, అభిలాష్‌నాయక్, వాల్య తదితరులు ఉన్నారు.

స్థానికేతరుల పేర్లతో ఇళ్ల స్థలాలు

మాజీ సర్పంచ్‌పై అధికారులకు ఫిర్యాదు

హయత్‌నగర్: తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్ గ్రామంలో స్థానికేతరుల పేర్లతో ఇండ్ల స్థలాల పట్టాలు తీసుకుని ఓ మాజీ సర్పంచ్ సొమ్ము చేసుకుంటున్నాడని గ్రామానికి చెందిన బచ్చిగళ్ల మంగమ్మ సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 383లో గతంలో ప్రభుత్వం సుమారు 450 మంది పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చిందని.. వాటిలో సగానికి పైగా స్థానికేతరుల పేర్లపై ఇండ్ల పట్టాలు తీసుకున్న మాజీ సర్పంచ్ వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టాలు ఇచ్చినవారి పేర్లకు సంబంధించిన గుర్తింపు కార్డులను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

చెన్నకేశవరెడ్డి విజయం ఖాయం: పీఆర్టీయూ

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ బలపరిచిన గుర్రం చెన్నకేశవరెడ్డి అభ్యర్థి గెలుపు ఖాయమని ఆ సంఘం ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ జోస్యం చెప్పారు. పోలింగ్ సందర్భంగా ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకున్న అనంతరం ఇబ్రహీంపట్నంలో సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సరళిని బట్టి తమ అభ్యర్థి విజయం తథ్యమన్నారు. తమకు మద్దతు నిస్తూ ఓటుహక్కును వినియోగించుకున్న అధ్యాపక, ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో పండ్ల పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం బీఆర్ఎస్ నాయకులు కానుగుల మహేశ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భర్తకి రాజు, చింతకింది జంగయ్య, బస్వాపురం కృష్ణ, గరిగే శేఖర్, ఎండీ కాలేద్, పాండు, అజయ్, మహేందర్, శ్రీను, రవిలు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రాఘవేందర్ రెడ్డి

ఆమనగల్లు: నిరుద్యోగ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ఐక్యతా ఫౌండేషన్ కార్యాలయంలో రెండు నెలలుగా నిరుద్యోగ యువతీయువకులకు వివిధ విభాగాలలో ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నారు. ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువతీయువకులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఎస్ఐ, కానిస్టేబుల్, గ్రూప్-4 వంటి ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీజేఆర్ కోచింగ్ నిర్వాహకులు, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న నేతలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం బండలాగుడు (పందెం గుండు) పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీజేపీ నేత ఆచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దాతలు శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ శ్రీనివాసురెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో... విజేత ఎద్దుల జతల యజమానులకు బహుమతులు అందజేశారు.హైదరాబాద్ రోహన్ బాబు ఎద్దుల జతకు ప్రథమ బహుమతి రూ.1,00,116, ద్వితీయ బహుమతి గుర్నాథ్‌రెడ్డికి రూ.75,116, తృతీయ బహుమతి హైదరాబాద్ ప్రసన్నకుమార్‌రెడ్డికి రూ.50,116, చతుర్థ బహుమతి గోపాల్‌రెడ్డికి రూ.30,116,పంచమ బహుమతి పరుశురాములుకు రూ.20,116 ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందజేశారు. జెడ్పీటీసీ విజితారెడ్డి, సర్పంచ్ శ్రీశైలం, ఉపసర్పంచ్ తిరుపతి, ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, పీఈటీ మల్లేశ్, సత్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, స్వామి, మాజీ ఎంపీటీసీ రవి, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, ఎంపీటీసీ రఘు, లక్ష్మయ్య, ఎలమందారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జయంతి వేడుకలు


మంచాల: మొల్లమాంబ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


యాచారం: వేడుకలో కుమ్మరి సంఘం నేతలు

మంచాల: మంచాల మండల కేంద్రంలో కుమ్మర సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు కాసుల పాండు ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మంచాల చౌరస్తాలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సమాజ అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. సమాజంలో ఉన్న రుగ్మతులపై పోరాడిన గొప్ప నాయకురాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాములు, యాదగిరి, బాలరాజు, శివకుమార్, విజయ్, మల్లేష్, రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాచారం మండల కేంద్రంలో..

యాచారం: మండల కేంద్రంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను సోమవారం కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు కొండాపురం శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు వెంకటయ్య, జగన్, నాగరాజు, శంకర్, శ్రీకాంత్, అంజయ్య, కాసుల పాండు, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన సంఘం ఆధ్వర్యంలో..

తలకొండపల్లి: మండల కేంద్రంలో సోమవారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కుమ్మరులు కవియిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రోగులు, మహిళలు, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. మొల్లమాంబ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, బాలకృష్ణ, యాదయ్య, చంద్రయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో నగరంలోని విశ్వేశ్వరయ్య భవనంలో 'గ్రామీణ విద్యా సంస్థల అభివృద్ధిలో స్థానిక సంస్థల భాగస్వామ్యం' అనే అంశంపై సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (కడ్తాల్ సర్పంచ్) గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. సదస్సుకు తెలంగాణ రాష్ట్రంతో పాటు, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారని లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ ప్రియాంక్ కనుంగో హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారని.. సదస్సుకు తెలంగాణ పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ శ్రీనివాస్ హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యా హక్కు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రగతి నివేదన యాత్రకు ప్రజల నీరాజనం


బతుకమ్మ, బోనాలతో ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికిన మహిళలు

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపడుతున్న ప్రగతి నివేదన యాత్రకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. సోమవారం మండలంలోని పిగ్లీపూర్ గ్రామంలో బోనాలు, బతుకమ్మలతో మహిళలు యాత్రకు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ నేతలు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

విజేతలకు బహుమతుల ప్రదానం

తలకొండపల్లి: క్రీడలు దేహ ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ.కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గత రెండు రోజులుగా నిర్వహించిన 17వ మెన్స్, ఉమెన్స్ ఓపెన్ టూ ఆల్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా దాతలు కాసు శ్రీనివాసురెడ్డితో పాటు, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, ఆమనగల్లు మెడికల్ హాల్ పాపిశెట్టి రాము ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజిసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, రామస్వామి, రావిచెడ్ అంజయ్య, సత్యం, విశ్వం, రాము, పీఈటీ మల్లేశ్, అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ రవి, వెంకటేష్, రాజు, మహేష్, దుర్గ, బాలు, కృష్ణగౌడ్, క్రీడాకారులు, పీఈటీలు, పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు తగవు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

మహేశ్వరం: మండల పరిధిలో మంత్రి సబితారెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చకు రావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ బీజేపీ నాయకులు సవాల్ విసిరారు. మంగళవారం ఉదయం 10గంటలకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చర్చకు మేం సిద్ధమన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ పరిధిలో జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో, మాడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్,, ఎస్టీ గురుకుల హాస్టల్, డైట్ కళాశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాలల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. నూతన తహసీల్దార్ భవనం, 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం, సహకార బ్యాంకు నూతన భవనం, కోర్టు భవనంతో పాటు పలు కార్యాలయాల ఏర్పాటుకు మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల ఉపాధ్యక్షుడు, బొర్ర కరుణాకర్, నాయకులు రఘుపతి, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'అవిశ్వాసం' నెగ్గేనా?

- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నేడు అవిశ్వాస తీర్మానం
- చైర్మన్, వైస్‌చైర్మన్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు
- నెగ్గాలంటే 9 మంది సభ్యుల మద్దతు అవసరం
- క్యాంపులో అధికార పార్టీకి చెందిన ఐదుగురు సభ్యులు!



మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

మంచాల: అధికార పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్‌లపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన పాలకవర్గ సభ్యులు చేస్తున్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం అవిస్వాస పరీక్షకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండు సంవత్సరాలుగా మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం వివాదాలకు కేరాఫ్‌గా మారింది. పాలకవర్గ సమావేశం ఎప్పుడు నిర్వహించినా సజావుగా సాగని పరిస్థితి. వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.32లక్షల60వేలు, నూతన భవన నిర్మాణానికి సంబంధించి రూ.9లక్షలు, స్టేషనరీ బిల్లులకు సంబంధించి రూ.7లక్షల50వేలు రికవరీ చేయనున్నట్లు తెలిసింది. ఓ వైపు రికవరీకి సంబంధించి విచారణ జరుగుతుండగానే మరో వైపు అవిస్వాస తీర్మాణం పెట్టనుండటంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.

అవిశ్వాసం పెట్టితీరుతాం..

ఎట్టి పరిస్థితుల్లో అవిస్వాసం పెట్టితీరుతామని విపక్ష సభ్యులు పట్టు పడుతున్నారు. అయితే మొదటి నుంచే సమన్వయ లోపంతో సహకార సంఘం సభ్యులు చైర్మన్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు సర్వసభ్య సమావేశంలో విమర్శలు కూడా చేసుకున్నారు. సహకార సంఘంలో అంతా అవినీతి జరుగుతోందని కనీసం తీర్మాణాలు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి. ధాన్యం కొనుగోలు నుంచి మొదలుకొని నూతన భవన నిర్మాణం వరకు అంతా అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో పాలకవర్గం సభ్యులు (సంఘం ఏర్పడి గత ఫిబ్రవరి 16 తేదీ నాటికి మూడేళ్లు పూర్తికావడంతో) ఫిబ్రవరి 20వ తేదీన డీసీఓ ధాత్రిదేవికి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వినతిపత్రం అందజేశారు.

ఎనిమిది అనుకూలం.. ఐదు వ్యతిరేకం..!

సహకార సంఘంలో మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. వారిలో అవిస్వాస తీర్మానం, చైర్మన్‌కు వ్యతిరేకంగా 8 మంది సంతకాలు చేయగా.. అధికార పక్షం వైపు ఐదుమంది ఉండగా ప్రతి పక్షం వైపు ఎనిమిది మంది సభ్యులు అయ్యారు. దీంతో అధికారులు ఈనెల 14న అవిస్వాసం పై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తేదీకూడా ప్రకటించారు. అయితే అవిస్వాసం నెగ్గాలంటే 1/3 మంది సభ్యులు సమావేశానికి హాజరు కావాలి. అంటే ఉన్న 13మంది సభ్యుల్లో ఖచ్చితంగా 9మంది సమావేశానికి హాజరు కావాలి. అప్పుడే సమావేశం కొనసాగుతుంది. ఇప్పటికే అవిస్వాసం వీగిపోయే విధంగా అధికార పక్షం వారు 5మంది సభ్యులతో క్యాంప్‌కు వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం ఎనిమిది మంది సభ్యులు మాత్రమే ఉండటంతో అవిస్వాసం వీగిపోయే అవకాశం లేకపోలేదు. నియోజకవర్గంలో ఎటు చూసినా, ఎవరిని అడిగినా అవిస్వాసం తీర్మానంపైనే టాక్ నడుస్తోంది.